జల్‌జీవన్ స్రవంతి

- నమకూరిన ఇంటింటికీ కుళాయిలు
- తీరిన నీటి సమస్య
- శరవేగంగా జల్‌జీవన్ మిషన్ పనులు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటింటా తాగునీరు అందించే ఏర్పాట్లు చేసింది. అంతకు ముందు ప్రభుత్వాలు పల్లె ప్రజలకు తాగునీరు అందించేందుకు చిత్తశుద్ధి చూపించలేదు. దీంతో అప్పట్లో గ్రామీణులు తాగునీటి కోసం అష్టకష్టాలు పడేవారు. బిందెలు పట్టుకుని వ్యవసాయ బావులు, బోర్ల వద్దకు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లేవారు. పంచాయతీల్లో అరకొర వసతులతో రక్షిత మంచినీటి పథకాలు ఉండేవి. విద్యుత్ సరఫరా లేకపోవడం, ట్యాంకులు శుభ్రం చేయకపోవడం, నీటిని విడుదల చేసే ఆపరేటర్లు లేకపోవడం వంటి లోపాల తాగునీటి సమస్య ఎక్కువగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన పట్టణాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాలకు సురక్షితమైన తాగునీటి సరఫరాపై దృష్టి సారించింది. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయిలు నిర్మించి మహిళలకు ఇబ్బంది కలగకుండా నీటి సరఫరాకు గాను ప్రభుత్వం జలయజ్ఞం మొదలు పెట్టింది. ఇందులో భాగంగా కొత్తగా ఓవర్‌హెడ్ ట్యాంకులు, బోరుబావులు, పైప్‌లైన్లు, ఇంటింటికీ వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు నిర్మిస్తున్నారు. బోరుబావులు ఫెయిల్ అయిన చోట పక్క గ్రామం నుంచి తరలిస్తున్నారు.

64 పంచాయతీల్లో 2.23 లక్షల మందికి ప్రయోజనం

భీమిలి నియోజకవర్గంలోని మూడు మండలాలలో 64 గ్రామ పంచాయతీలకు చెందిన 2,23,736 మంది ప్రజలు జల్‌జీవన్ పథకం ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

ఇప్పటికే చాలా వరకు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్లు పూర్తికాగా కొన్ని చోట్ల నిర్మాణ దశలో ఉన్నాయి. వీటిని రెండు దశలలో పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇందులో కొన్ని పనులు తుదిదశలో ఉండగా మరికొన్ని పనులు నిర్మాణంలో ఉన్నాయి.

- భీమిలి మండలంలో రూ.18.47 కోట్లతో 105 వర్కులు కేటాయించారు.
- ఆనందపురం మండలంలో రూ.32.08 కోట్లతో 153 వర్కులకు కేటాయించారు.
- పద్మనాభం మండలంలో రూ.17.81 కోట్లతో 89 వర్కులకు కేటాయించారు.
- భీమిలి మండలంలో జల్‌జీవన్ మిషన్ పనులు పంచాయతీల వారీగా అమనాం రూ.2.31 కోట్లు, అన్నవరం రూ.41.70 లక్షలు, బోడమెట్టపాలెం రూ.16.60, చిప్పాడ రూ.1.41 కోట్లు, దాకమర్రి రూ.1.38 కోట్లు, లక్ష్మీపురం రూ.1.06 కోట్లు, మజ్జిపేట రూ.61.44 లక్షలు, మజ్జివలస రూ.58.04 లక్షలు, మూలకుద్దు రూ.91.22 లక్షలు, పెదనాగమయ్యపాలెం రూ.51.69 లక్షలు, తాళ్లవలస రూ.1.72 కోట్లు, టి.నగరపాలెం రూ.84.86, తాటితూరు రూ.1.41 కోట్లు, శింగనబంద రూ.59.36 లక్షలు, నారాయణరాజుపేట రూ.28.60 లక్షలు, రేఖవానిపాలెం రూ.67.06 లక్షలు జరుగుతున్నాయి.


తాటితూరులో జల్‌జీవన్ నిధుల ద్వారా నిర్మించిన రక్షిత మంచినీటి పథకం


పెద్దిపాలెంలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం


జీరుపేటలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు


మజ్జివలసలో పూర్తయిన ఓవర్‌హెడ్ ట్యాంకు


అమనాంలో నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

వ్యవసాయభూముల నుంచి తెచ్చేవాళ్లం



తాగునీటి కోసం బిందెలు పట్టుకుని ఊరు అవతలి ట్యాంకులు, వ్యవసాయ భూముల్లోకి గతంలో వెళ్లేవాళ్లం. మోసుకు రావడానికి కష్టంగా ఉండేది. ఇప్పుడు ఇంటి ముందే కుళాయి కనెక్షన్లు వచ్చాయి.

–బవిరిశెట్టి లక్ష్మి, తాటితూరు

నీటి సమస్య పరిష్కారమైంది



నీళ్ల కోసం మహిళలే కాకుండా ఇంట్లో మగవాళ్లు కూడా బిందెలు పట్టుకుని నీళ్ల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లేవాళ్లం.. ఇప్పుడా ఆ బాధ తప్పింది. ఇంటి ముందే కుళాయిలు వచ్చాయి. నీటి సమస్య పరిష్కారమైంది.

– రాంపిల్లి నాగేశ్వరరావు

బ్రహ్మకుమారి కేంద్రాన్ని సందర్శించిన ముత్తంశెట్టి


మృత్యుంజయ భాయ్, ఇతర ముఖ్యులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: రాజస్తాన్‌లోని మౌంట్ అబూ వద్ద నున్న బ్రహ్మకుమారి ఆధ్యాత్మిక మెమోరియల్ కవర్ ఆఫ్ పీస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆయన సతీమణి జ్ఞానేశ్వరి మంగళవారం సందర్శించారు. విశాఖలోని రాజయోగ మెడిటేషన్ సెంటర్ ఇన్‌చార్జి శ్రీలీల ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని యోగా, ధ్యాన మందిరాలను సందర్శించారు. అలాగే బ్రహ్మకుమారి అంతర్జాతీయ సేవా కేంద్ర ఇన్‌చార్జి డాక్టర్ మృత్యుంజయ భాయ్ కలుసుకుని ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడి ప్రాంత గొప్పదనాన్ని తెలిపారు, బ్రహ్మకుమారి కేంద్రం అందులోని సోదరీమణులు అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు ఎంతో గొప్పవని తెలిపారు. వారు దేశం సంక్షేమంగా ఉండి అందరు బాగుండాలని ప్రార్థిస్తారని తానుకూడా రాష్ట్ర ప్రజలందరు బాగుండాలని ప్రార్థించానని తెలిపారు.

నేడు శ్రవణ నక్షత్ర హోమం

సింహాచలం: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం కొండదిగువ ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 8.30గంటల నుంచి విశేష హోమం నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి తెలిపారు. భక్తులంతా కార్యక్రమాల్లో పాల్గొని తరించాలని కోరారు.

క్లుప్తంగా

శ్మశానవాటికలో అదనపు వసతులు


చిల్లపేట శ్మశానవాటికలో పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు గల్లీరోడ్డులోని చిల్లపేట శ్మశానవాటికలో అదనపు వసతుల నిర్మాణానికి పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. వీటిని వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. షెడ్లు, బర్నింగ్ ప్లాంట్ నిర్మాణానికి యంత్రాలతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు జగదీష్, రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, చిల్ల సూరి నరసయ్యరెడ్డి, చిల్ల సూర్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ అనుపు ఉత్సవం


కృష్ణాపురంలో కోలాటం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో మంగళవారం రాత్రి దుర్గాలమ్మ అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ బండిని రథంగా అందంగా తీర్చిదిద్దారు. ఈ రథాన్ని గ్రామ ప్రవేశం నుంచి చివరకు వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా డీజే, చిడతలు వంటి సాంస్కృతిక క్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మహిళల అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని పూజలు నిర్వహించారు.

పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి


ఆహార పదార్థాలతో నిర్వాహకులు

భీమునిపట్నం: పిల్లలకు పౌష్టిక విలువలు ఉన్న ఆహారాన్ని అందివ్వాలని అప్పుడే వారు ఆరోగ్యవంతంగా ఎదుగుతారని మండల విద్యాశాఖ అధికారి శివరాణి అన్నారు. మంగళవారం ఇక్కడ పాఠశాలల స్థాయి వంటవారు, సహాయకులకు గోరుముద్ద కార్యక్రమానికి సంబంధించి శిక్షణ, వంటల పోటీలను నిర్వహించారు. ప్రతి ఒక్కరు నాణ్యత, పరిశుభ్రతకు వంటలు చేయాలన్నారు. మెను ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఈ సందర్భంగా వంటల పోటీలను నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఏపీ జ్యోతి, ఉపాధ్యాయినులు సంతోషి, జయసుధ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలకు ఉపాధిహామీ కూలీల విలవిల


ఆనందపురం మండలంలో చెట్టు నీడన సేదతీరుతున్న ఉపాధి హామీ కూలీలు

తగరపువలస: ఆనందపురం మండలంలో ఉపాధి హామీ కూలీలు ఎండకు విలవిలలాడుతున్నారు. నాలుగు రోజులుగా రోహిణీకార్తె కారణంగా ఎండలు మరింత తీవ్రరూపం దాల్చడంతో కూలీలు ఎండలకు తాళలేకపోతున్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు వంటి కనీస సదుపాయాలు లేని కారణంగా చెట్ల నీడన సేదతీరుతున్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అధికారులు పనిప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న భీమిలి ఇంచార్జ్ ముత్తంశెట్టి మహేష్ తదితరులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు ఎల్లారమ్మ మెట్టలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భీమిలి ఇంచార్జ్ ముత్తంశెట్టి మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించుకున్నారు. జూన్ 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో భీమిలి నుంచి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు. కౌంటింగ్ సమయంలో తీసుకోలసిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, చింతగుంట శివ, అమ్మిరెడ్డి, దుంప సాయిరెడ్డి, వెంపాడ వెంకటరమణ, లెంక రమేష్, రొక్కం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల వారాల పండగ


భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న స్థానికులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ గ్రామ దేవతకు శ్రీపోలమాంబ, శ్రీ సత్తమ్మ తల్లి, శ్రీ ఎర్నమ్మ అమ్మవార్లు వారాల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవార్లకు పసుపు కుంకుమ సమర్పించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు స్థానిక నాయకులు సాకరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

నురగలు కక్కుతున్న నీటి కాలుష్యం


నురుగులు కక్కుతున్న కలుషిత నీరు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో గెడ్డ నీరు కలుషితమవుతోంది. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారికవలస, కొమ్మాదిలోని కొన్ని సీ ఫుడ్స్ కంపెనీలు కలుషిత నీరును నేరుగా మారికవలస నుంచి కాపులుప్పాడ గెడ్డలోకి వదలేస్తున్నారు. దీంతో నీరు కలుషితమవ్వడమే కాకుండా దుర్వాసన వెదజల్లుతోంది. మంగళవారం ఈ గెడ్డ వద్ద భారీ ఎత్తులో కలుషిత నీరు నురుగులు కక్కుతున్న దృశ్యమే దీనికి సాక్ష్యం. ఇదే కలుషిత నీరు ఇక్కడ సమీపంలో పంట పొలాలతో పాటు నగరపాలెం నుంచి ప్రవహించే గెడ్డలో కలుస్తోంది. నేరుగా సముద్రంలో ఈ కలుషిత నీరు కలవడంతో మత్స్య సంపదకు ఇబ్బంది కలుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలుషిత నీరు విడుదల చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అమ్మవార్లకు నాణేలతో అలంకరణ


నాణేలు, పువ్వులతో అలంకరించబడిన రాస పోలమాంబ అమ్మవారు


తులసి, బంతిపూల దండలతో పాత చెరకుపల్లి తోగాలమ్మ తల్లి

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం 2.5 రూపాయల నాణేలు, లిల్లీ, గులాబీ, బరబరా అలంకరించారు. ఈ అలంకరణకు గాను మజ్జివలసకు చెందిన గుద్దాల అప్పలరాజు, పైడిరాజు దంపతులు సహాయ సహకారాలు అందించారు. భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు. పాత చెరకుపల్లి గ్రామ దేవత తోగాలమ్మ వార్షిక ఉత్సవాలలో భాగంగా రిక్క అప్పలనరసయ్య, లక్ష్మిల ఆధ్వర్యంలో అమ్మవారిని తులసి మాలలు, బంతి పూలదండలతో అలంకరించారు.

సుత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ


ప్రత్యేక అలంకరణలో మూలకుద్దు సుత్తమ్మతల్లి

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు గ్రామదేవత సుత్తమ్మతల్లి ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారిని కనకాంబరాలు, మల్లెలు, గజమాల, తులసిమాలలతో అలంకరించారు. బుధవారం మధ్యాహ్నం చిప్పాడ, మూలకుద్దు గ్రామపంచాయతీలకు చెందిన ఆలయాల వద్ద అమ్మవార్ల అనుపు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు.

భోజనం రుచిగా ఉండాలి


కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో చంద్రకళ

కొమ్మాది: ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనం రుచిగా ఉండేలా చూసుకోవాలని డీఈవో ఎల్. చంద్రకళ అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల లెవిల్ మధ్యాహ్న భోజన పథకంపై శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతి రోజూ వంట మెనూ ప్రకారం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుంచి వచ్చిన కుక్ కమ్ హెల్పర్స్‌తో వంటకాల తయారీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రథమ బహుమతి సాధించగా, ద్వితీయ బహుమతి గాంధీ నగర్ ఎంపీపీ స్కూల్ నిర్వాహకులు ఎంపికయ్యారు. వీరికి డీఈవో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండీఎం కో ఆర్డినేటర్ ఎస్. జె శాస్త్రి, ఎంఈవోలు సీహెచ్ రవీంద్రబాబు, పి.అనురాధ పాల్గొన్నారు.

త్రిశక్తి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


త్రిశక్తి ఆలయంలో ఎర్నమ్మ తల్లి

మధురవాడ: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే ముగ్గురు అమ్మలకు మంగళవారం త్రిశక్తి ఆలయం పరిసర ప్రాంతాలకు చెందిన పలు కాలనీలు గ్రామాల ప్రజలు పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకునున్నారు. ఈ సందర్భంగా అమ్మ వార్లకు నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమ్మాది జంక్షన్‌లో త్రిశక్తి ఆలయంలో వెలసి మధురవాడ పరిసర ప్రాంత 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవతలు శ్రీ బంగారమ్మ, ఎర్నమ్మ, దుర్గ దండుమారమ్మ అమ్మ వార్లకు శ్రీ బంగారమ్మ తల్లి ఆలయం ఆధ్వర్యంలో ఉదయం 5గంటలకు మేలు కొలుపు, 6.30 గంటలకు నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

శార్వాణి రెడి మిక్స్ ప్లాంట్ సీజ్


శివశక్తినగర్ సమీపంలోని శార్వాణి రెడి మిక్స్ ప్లాంట్‌ను సీజ్ చేస్తున్న జీవీఎంసీ అధికారులు


వాహన డ్రైవర్‌ను విచారిస్తున్న జీవీఎంసీ అధికారి కిశోర్

సాక్షి ఎఫెక్ట్..

- కనీస అనుమతులు లేకుండా కార్యకలాపాలు
- రూ. 25వేలు జరిమానా కూడా..

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2 పరిధి మారికవలస–తిమ్మాపురం రోడ్డులోని శార్వాణీ రెడి మిక్స్ సిమ్మెంట్ కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్‌ను జీవీఎంసీ అధికారులు సీజ్ చేశారు. రూ. 25 వేలు జరిమానా కూడా విధించారు. సిమ్మెంట్–కాంక్రీట్ పరిశ్రమల మిశ్రమంతో నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వలన రహదారులు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. మిశ్రమ వ్యర్థాలు రోడ్డుపై , ప్రభుత్వ స్థలాల్లో డంప్ చేయడం వలన అవి కలుషితం అయిపోతున్నాయి. 'మిక్సింగ్ ప్లాంట్‌ల నిర్లక్ష్యంతో అధ్వానంగా రోడ్లు' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితం అయింది. దీనిపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ స్పందించారు.

తీగ లాగితే డొంక కదిలింది..

జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు జీవీఎంసీ జోన్–2 వైద్యాధికారి, జీవీఎంసీ వెటర్నరీ ఆఫీసర్ కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకర శ్రీను తదితరులు శివశక్తినగర్ దగ్గర ఉన్న సదరు పరిశ్రమ వద్ద తనిఖీలు నిర్వహించి, విచారణ చేపట్టారు. దీంతో ఈ ప్లాంట్‌కు అనుమతులతో పాటు కనీసం ట్రేడ్ లైసెన్స్ కూడా లేనట్టు బయటపడింది. ఇంత భరితెగించి ప్రభుత్వానికి కట్టాల్సిన ఫీజులు ఎగ్గొట్టి ఇష్టానుసారంగా నడుపున్న ప్లాంట్‌ను అధికారులు సీజ్ చేశారు.

రూ. 25వేలు జరిమానా విధించినట్టు కిశోర్ చెప్పారు. ట్రేడ్ లైసెన్స్ ఇతర అనుమతులు తెచ్చుకోవడానికి వారం రోజుల సమయం ఇచ్చామని, తెచ్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రుతుక్రమ శుభ్రతపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బాలికలు, మహిళలు

తగరపువలస: ప్రపంచ రుతుక్రమం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం సంతపేట, చాకలిపేట, తగరపువలస మెర్జింగ్ అంగన్వాడీ కేంద్రాల్లో యుక్త వయసు, వయోజన మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాసవ్య మహిళా మండలి, కుశల్ ప్రాజెక్ట్ సంయుక్తంగా చేపట్టిన ఆరోగ్య కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. రుతుక్రమం అనేది ప్రతినెల మహిళలలో జరిగే ఒక సాధారణ ప్రక్రియ అని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆరోగ్య సంరక్షణ, తీసుకోవలసిన ఆహారం, నేప్‌కిన్ పాడ్‌లు వినియోగించడం వలన కలిగే ప్రయోజనాలను తెలిపారు. యుక్త వయసుకు వచ్చే ప్రతి బాలికలకు తల్లులు రుతుక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల కమ్యూనిటీ ఆర్గనైజర్లు కేవీ పార్వతి, ఎస్.రాశి, అంగన్‌వాడీలు శ్రీగౌరి, ఎంవీ అన్నపూర్ణ, ఏఈవీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జితసేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది.